సాక్షి వికారాబాద్

బుధవారం ׀ 21 ׀ ఆగస్టు ׀ 2024



సమస్యలన్నీ పరిష్కరిస్తాం

విద్యుత్ తీగలు తరచూ తెగిపడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 8లో▸



రైతువేదికలో చోరీ

చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ రైతు వేదికలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. 8లో▸



ఆస్తులున్నా.. దీపం కరువు

ఆలయాలకు కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు ఉన్నా దీపం వెలిగించేందుకు నిధులు కరువయ్యాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి విధుల్లోకి ఇన్‌స్ట్రక్టర్లు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తాత్కాలికంగా తీరనుంది. బుధవారం 53మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధుల్లో చేరనున్నారు. బొంరాస్‌పేట మండలంలో 11మంది, దుద్యాలలో 10, కొడంగల్‌లో 11, దౌల్తాబాద్‌లో 21 మంది విధుల్లో చేరనున్నారు.

కాంగ్రెస్‌కు యువతే బలం

యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆమేర్ అబ్దుల్లా



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

తాండూరు: కాంగ్రెస్ పార్టీకి యువతే బలమని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆమేర్ అబ్దుల్లా అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై యూత్ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహిస్తోందన్నారు. సెప్టెంబర్ 14వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు యూత్ కమిటీల ఎన్నిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తాండూరు మండల మాజీ అధ్యక్షుడు జగదీష్, నాయకులు లోకేష్, సూరి, నరేష్, శ్రీహరి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఎంఈఓ హరిశ్చందర్

దోమ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ హరిశ్చందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమ కేజీబీవీలో సహాయ వంట కార్మికురాలు, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూడూరు మండలంలో సహాయ వంట కార్మికురాలి పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈ నెల 24వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు, కనీసం 7వ తరగతి చదివి ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. స్థానిక మండలం వారికే అవకాశం ఉంటుందని తెలిపారు.

వైద్య సిబ్బందికి మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

దోమ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్య సిబ్బందికి అధికారులు మెమోలు జారీ చేశారు. మంగళవారం సాక్షి దినపత్రికలో వైద్యులు ఉండరు.. చికిత్స అందదు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఏఎన్‌ఎం తోపాటు మరొకరికి మెమో జారీ చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ తెలిపారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

రంగారెడ్డి డీఏఓ గీతారెడ్డి



మొయినాబాద్ రైతు వేదికలో మాట్లాడుతున్న డీఏఓ గీతారెడ్డి

మొయినాబాద్: రుణమాఫీపై రైతులు ఆందోళన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ రైతులందరికీ వస్తుందన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్నవారు.. పైన ఉన్న మొత్తాన్ని.. వడ్డీని బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణమాఫీ కానివారు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 రోజులపాటు గ్రామాల్లోకే అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఏఓలు రాగమ్మ, అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫుల్ రష్

సాక్షి ఫోకస్



పరిగి: బస్సులోకి ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



తాండూరు: బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

రాఖీ పండుగ, వరుస సెలవుల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి కనిపించాయి. సోమ, మంగళవారాల్లో ప్రయాణికుల తాకిడికి బస్టాండ్లు, బస్సులు కిటకిటలాడాయి. పట్టణాలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ జనంతో కిక్కిరిసి పోతున్నాయి. బస్సులో కాలు తీసి పెట్టడానికి కూడా అవకాశం ఉండటం లేదు. 60 సీట్ కెపాసిటీ ఉన్న బస్సులో వంద నుంచి 150 మంది ప్రయాణం చేస్తున్నారు. బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. సమయానికి స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. ఉపాధ్యాయులతో చీవాట్లు తినాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి' ఫోకస్

మిగతా 8లో▸



కొడంగల్ రూరల్: ప్రయాణికులతో కిక్కిరిసిన కొడంగల్ బస్టాండ్



ధారూరు: బస్సులో చోటులేక అవస్థలు పడుతున్న మహిళలు

ఎల్‌ఆర్‌ఎస్

ప్లాట్ల క్రమబద్ధీకరణకు అధికారుల కసరత్తు

- నాలుగు మున్సిపాలిటీల్లో 20,968 దరఖాస్తులు
- గ్రామ పంచాయతీల్లో 12,745 అర్జీలు
- పరిశీలనకు త్రిసభ్య కమిటీలు



పరిగి సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్

వికారాబాద్: ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌ఐలకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం వేలాది మంది నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసి ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు 33వేల మందికి లబ్ధి చేకూరనుంది. చాలా సంవత్సరాలుగా రియల్టర్లు డీటీసీపీ అనుమతులు లేకుండా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వెంచర్లు వేసి ప్లాట్లను విక్రయించారు. 2020లో అప్పటి ప్రభుత్వం టీఎస్ బీపాస్ నిబంధనలు అమల్లోకి తేవడంతో అనుమతులు లేకుండా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బంది పడ్డారు. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ప్లాట్లు లేదా వెంచర్లకు ప్రభుత్వం అనుమతులు తప్పనిసరిగా ఉండాలని షరతు పెట్టింది. దీంతో అనుమతులు లేకుండా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అయోమయంలో పడ్డారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దరఖాస్తుదారులకు ఊరట లభించినట్లయ్యింది.

అనుమతులు లేని లేఅవుట్లే అధికం

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లే అధికంగా ఉన్నాయి. దాదాపు 550అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో 20,968, జీపీల్లో 12,745 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వీటికి మోక్షం లభించనుంది.

దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడమే కాకుండా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇప్పటికే ప్రజలు రెండు దఫాలుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందు కోసం రూ.1000 చెల్లించారు. మరి కొంత మంది రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేశారు. ఆ తర్వాత కోర్టు కేసులు.. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆందోళనలు వంటి కారణాల నేపథ్యంలో సర్కారు దిగివచ్చి ఎల్‌ఆర్‌ఎస్‌ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. వ్యవసాయేతర భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఎల్‌ఆర్‌ఎస్‌తో సంబంధం లేకుండా పాత పద్ధతిలో జరిగేలా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అనుమతులు లేని వెంచర్లలో పాట్లు కొనుగోలు చేసిన వాటన్నింటినీ ఎల్‌ఆర్‌ఎస్ లేకుండానే క్రయవిక్రయాలకు అనుమతి ఇచ్చింది. 2020 నుంచి ఇప్పటి వరకు అదే పద్ధతి అవలంబిస్తూ వచ్చారు. ఇప్పుడు వాటి క్రమబద్ధీకరణకు సర్కారు అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల పరిశీలనకు మూడు శాఖల అధికారులతో త్రిసభ్య కమిటీలు వేయనున్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ఇందు కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌ఐలకు ఎల్‌ఆర్‌ఎస్ దర ఖాస్తుల పరిశీలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపటి నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కావాలని ఆదేశించారు. వెరిఫికేషన్ రిపోర్ట్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనుమతులు లేని లే అవుట్లను క్రమబద్ధీకరించడానికి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహమ్మద్, విక్రం సింహారెడ్డి, బలరాం నాయక్, మాధవి, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- పాల్గొన్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

కొడంగల్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కడా కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రోడ్ల విస్తరణపై పంచాయత్ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కళాశాలల నిర్మాణం కోసం భూ సేకరణ చేపట్టాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల భవన నమూనాలు, ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. నీటి ట్యాంకుల నిర్మాణాలు, పైప్‌లైన్‌ల పనులకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. చెక్‌డ్యాంల నిర్మాణం, అటవీ భూముల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై ఎక్కడా గుంతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి: జిల్లాలో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం నగరం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో భారీ వర్షాలు, ధరణిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యా నాయక్, వికారాబాద్, తాండూరు ఆర్‌డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంజీవరెడ్డి, ఇరిగేషన్ ఈఈ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో భారీ వర్షం

అనంతగిరి: వికారాబాద్ మండలంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పట్టణ పరిధిలోని గిరిగేట్‌పల్లి రైల్వే బ్రిడ్జి కింద, గోధుమగూడ – జైదుపల్లి బ్రిడ్జిల కింద వర్షపు నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొలంలో నిలిచిన వర్షపునీరు

అర్హులు ఓటు హక్కు పొందాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ సర్వే చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్‌ఎంటీలు, ఎంటీలు, ఏఎల్‌ఎంటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబరు 28వ తేదీ వరకు ప్రీ రివిజన్ నిర్వహించి 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశించారు. నవంబరు 28, 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18, 2024 వరకు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికి వెళ్లి ఓటరు ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల కొత్త ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. 100 శాతం వెరిఫికేషన్ పూర్తి కావాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ మార్పు అవసరం ఉంటే చేపట్టాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీలను తొలగించాలని సూచించారు. ఓటరు కార్డులో తప్పులు ఉంటే సరి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, వివిధ శాఖల అధికారులు మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కొడంగల్ రైతులు భయంభయంగా గడుపుతున్నారు
- వీరి భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది
- ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



విలేకరులతో మాట్లాడుతున్న డీకే అరుణ

కొడంగల్: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె కొడంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం చేశారని విమర్శించారు. రైతులకు ఖరీఫ్ ప్రారంభంలోనే ఇవ్వాల్సిన రైతుబంధు డబ్బులను ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ సొమ్మునే రుణమాఫీకి కేటాయించి, పూర్తి స్థాయిలో మాఫీ చేయకుండా చేతులు దులుపుకొన్నారని ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో రైతులు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. ఫార్మా కంపెనీల పేరుతో భూములను తీసుకోడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కర్షకుల భూములను లాక్కుని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ద్వారా మూడు నియోజకవర్గాలకే మేలు జరుగుతుందన్నారు. పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని విస్తరించి శ్రీశైలం బ్యాక్ వాటర్ కాకుండా జూరాల నుంచి నీటిని తీసుకోవాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల భూములకు సాగునీరు అందించవచ్చని వివరించారు. వికారాబాద్ కృష్ణా రైల్వేలైన్‌కు కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేసి ఇస్తే పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పున్నంచంద్ లాహోటీ, బస్వరాజ్, ప్రతాప్ రెడ్డి, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏఓగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ



మర్పల్లి: మండల వ్యవసాయ శాఖ అధికారిగా (ఏఓగా) మంగళవారం శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు శ్రీకాంత్ సంగారెడ్డి పట్టణంలోని వ్యవసాయ శాఖ జిల్లా శిక్షణ కేంద్రంలో ఏఈఓగా విధులు నిర్వహించి పదోన్నతిపై మర్పల్లికి వచ్చారు. ఇక్కడ పని చేసిన వసంత బదిలీపై రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రంలో సాయిల్ టెస్టు ఏఓగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారం కోసం నూతన సాగు విధానంపై సలహాలు సందేశాలు ఇచ్చి అధిక పంట దిగుబడులు సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి



నారాయణరెడ్డి(ఫైల్)

పరిగి: అనారోగ్యంతో కాంగ్రెస్ సీనియర్ నేత నారాయణరెడ్డి(85) మంగళవారం మృతి చెందాడు. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన నారాయణరెడ్డి 40 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఎన్నో పదవులను చేపట్టారు. మండల అధ్యక్షుడిగా జిల్లా కమిటీలో పనిచేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కారు,బైక్ ఢీ..

ఇద్దరికి గాయాలు

కుల్కచర్ల: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన యోగేష్ పూజాసామగ్రి కొనుగోలుకు చౌడాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా చౌడాపూర్ నుంచి మరికల్ వైపు ప్రయాణిస్తున్న ఓ కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న యోగేష్, మంగేష్ గాయపడ్డారు. యోగేష్ తలకు బలమైన గాయాలవ్వడంతో ఆయన్ను మహబూబ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జైపాల్ రెడ్డి తెలిపారు.

పలువురికి అస్వస్థత

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పీరంపల్లిలో అస్వస్థతకు గురైన పలువురిని మంగళవారం ఉదయం పట్టణంలోని మిషన్ ఆస్పత్రి, ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వీరంతా సోమవారం రాత్రి గ్రామంలో విక్రయించిన కల్లు తాగినట్లు సమాచారం. ఆతర్వాత వాంతులు, విరేచనాలు చేసుకున్న ఆరుగురిని కుటుంబ సభ్యులు ఉదయాన్నే వికారాబాద్‌కు తరలించారు. కల్తీ కల్లు తాగడంతోనే వీరు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

పీహెచ్‌సీలో కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు



క్యాంపును పరిశీలిస్తున్న వైద్యాధికారులు

అనంతగిరి: వికారాబాద్‌లోని రామయ్యగూడ పీహెచ్‌సీలో కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో కేన్సర్ రోగులను గుర్తించడం కోసం జిల్లాలో ఆరు స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు చేశామన్నారు. గ్రామాల్లో అనుమానిత లక్షణాలున్న వారిని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గుర్తించి పీహెచ్‌సీలో నిర్వహించే స్క్రీనింగ్ క్యాంపునకు తీసుకువస్తారన్నారు. 101 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిరోషా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్, డాక్టర్ పవిత్ర, బుచ్చిబాబు, నిఖిల్, కృపాలత, రజిత పాల్గొన్నారు.

రాఖీ పండుగ నేపథ్యంలో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. సోదరులకు రాఖీలు కట్టేందుకు వెళ్లడం.. వెళ్లినవారు తిరిగి వస్తుండడంతో సోమ, మంగళవారాలు బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. బస్సుల కోసం బస్టాండ్లలో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. సీట్లు ఖాళీగా లేకపోవడంతో చాలామంది నిలబడే ప్రయాణం చేశారు. చంటిపిల్లలతో ఇబ్బందులు పడ్డారు.



సాక్షి ఫోకస్

ఫుల్ రష్

కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు

- రాఖీ పండుగ నేపథ్యంలో రద్దీ
- కిటకిటలాడిన బస్టాండ్లు
- గంటల తరబడి నిరీక్షణ
- ప్రయాణికులకు తప్పని పాట్లు



కుల్కచర్ల బస్టాండ్‌లో ప్రయాణికుల నిరీక్షణ

❖ జనం రద్దీ

కుల్కచర్ల: రాఖీ పౌర్ణమి నేపథ్యంలో ప్రయాణికులు ఎక్కువగా బస్టాండ్‌కు వచ్చారు. మధ్యాహ్నం ఎంత సేపు నిరీక్షించిన బస్సులు రాకపోవడంతో జనం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మరికొందరు విసిగి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

❖ సర్వీసులు పెంచినా సరిపోలే

పరిగి: రాఖీ పౌర్ణమి సందర్భంగా రెండు రోజులుగా ఆర్టీసీ బస్టాండ్‌లో భారీగా రద్దీ ఏర్పడింది. బస్సు రావడమే ఆలస్యం ప్రయాణికులు తోసుకుంటూ ఎక్కేస్తున్నారు. సరిపడ బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు గంటల సమయం వేచి ఉండాల్సిన దుస్థితి. బస్సు సర్వీసులు పెంచినా ఇబ్బందులు తప్పలేదు. మహిళలు ఎక్కువ శాతం ఆర్టీసీ ప్రయాణానికి మొగ్గు చూపారు.

గతేడాదికన్నా రద్దీ పెరిగింది



రెండు రోజులుగా రద్దీ బాగా పెరిగింది. అవసరాన్ని బట్టి అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ రూట్లో ఎక్కువగా ప్రయాణించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ప్రయాణించే వారిలో 60శాతం మహిళలు, 40శాతం పురుషులు ఉన్నారు.

– కరుణశ్రీ, పరిగి ఆర్టీసీ డీఎం.



పరిగిలో రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

గమ్యం చేరేందుకు సర్కస్ ఫీట్లు

తాండూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణంలో సర్కస్ ఫీట్లు తప్పని సరిగా మారాయి. బస్సులో సీటు దొరికిందంటే లక్కీ ప్యాసింజర్ అనే రోజులు వచ్చాయి. తాండూరు ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నుంచి అన్ని రూట్లలో ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసాయి. బస్సుల కోసం గంటల తరబడి వేచి చూసి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణం తప్పడం లేదు. తాండూరు డిపోలో మొత్తం 94 బస్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో డిపో ఆధీనంలో 62 బస్సులు ఉండగా అద్దె బస్సులు 32 ఉన్నాయి. ప్రతి రోజు 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజు డిపోకు రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేసిన నాటి నుంచి ఆర్టీసీకి ఆదాయం పెరిగి లాభాల బాటలో నడుస్తోందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. గతంలో హైదరాబాద్-2 డిపోకు చెందిన బస్సులు తాండూరు రూట్‌లో ప్రయాణించేవి. మహాలక్ష్మి పథకం అమలు చేసిన నాటి నుంచి బస్సులు తగ్గిపోయాయి. దీంతో హైదరాబాద్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మరో వైపు గ్రామాలకు వెళ్లే బస్సుల్లో సైతం ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం 5 గంటలకు రావాల్సిన బస్సు 6 గంటల తర్వాత వస్తోందని దీంతో ఇంటికి వెళ్లే సరిగి రాత్రి అవుతోందని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇబ్బంది పడుతున్నాం

తాండూరులో పారామెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. బస్సు ఆలస్యంగా రావడంతో హంక్యానాయక్ తండాకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నా. ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి బయలు దేరి రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుతున్నాం. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అధికారులు బస్సులను సమయానికి నడిపించేలా చూడాలి.

– మనీషా, విద్యార్థి, బషీరాబాద్

ప్రతిపాదనలు పంపించాం

తాండూరు ఆర్టీసీ డిపోకు విడతల వారీగా కొత్త బస్సులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 20 వరకు కొత్త బస్సులు వచ్చాయి. ప్రయాణికుల డిమాండ్ మేరకు మరో 10 బస్సులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో బస్సులు అందుబాటులోకి వస్తాయి.

– సురేష్‌కుమార్, మేనేజర్, తాండూరు డిపో



❖ చులకనగా చూస్తున్నారు

మర్పల్లి: మండలం నుంచి నిత్యం వేలాదిగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. సరిపడ బస్సులు లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉచిత ప్రయాణం నేపథ్యంలో కండక్టర్లు, పురుషులు తమను చులకనగా చూస్తున్నారని పలువురు మహిళలు 'సాక్షి'తో వెల్లడించారు. ఆర్టీసీ అధికారులు బుదేర నుంచి మర్పల్లి మీదుగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదని వాపోయారు.



మర్పల్లిలో బస్సు ఎక్కేందుకు జనం పోటీ

❖ ఆర్టీసీలో అగచాట్లు

ధారూరు: రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చే వారితో బస్సులు కిక్కిరిసాయి. కనీసం నిల్చునేందుకు కూడా జాగ లేక ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వెళ్లిబుచ్చారు. బస్సులు సరిపడా లేక ఆటోల్లోనే ప్రయాణం చేశామన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించి సరిపడా బస్సులు నడపడం లేదని పెదవిరిచారు.

వరుస సెలవులు

కొడంగల్ రూరల్: రాఖీ పౌర్ణమితో పాటు వరుస సెలవులు రావడంతో రాకపోకలు పెద్ద ఎత్తున సాగాయి. సమయానుకూలంగా బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. వస్తే ఒక్కసారిగా ఐదు బస్సులు వస్తున్నాయని లేదంటే గంట గడిచినా ఒక్క బస్సు రావడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరారు.

సమయానుకూలంగా నడిపించాలి



ఆర్టీసీ అధికారులు బస్సులను సమయానుకూలంగా నడిపించాలి. రాఖీ పౌర్ణమి సందర్భంగా బంధువుల ఇళ్లకు వెళ్లివస్తున్న క్రమంలో బస్టాండులో రద్దీగా మారింది. పండగల సమయంలో బస్సులను అదనంగా నడిపిస్తూ ప్రయాణీకుల ఇబ్బందులు తొలగించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– భరత్‌కుమార్, రుద్రారం

మరికల్ రైతువేదికలో చోరీ

రూ.1.40 లక్షల విలువైన సామగ్రి మాయం

కుల్కచర్ల: గుర్తు తెలియని దుండగులు మరికల్ రైతు వేదికలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చౌడాపూర్ మండల పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వ్యయసాయాధికారులు తెలిపిన ప్రకారం.. మరికల్ పంచాయతీ పరిధిలోని రైతువేదికలో గుర్తు తెలియని దుండగులు చొరబడి స్టోర్ రూంలోని కంప్యూటర్, ఇన్వర్టర్, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే పరికరాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం కార్యాలయం తెరిచేందుకు వెళ్లిన సిబ్బంది తాళం విరిగి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. ఈ చోరీలో సుమారు రూ.1.40లక్షల విలువైన సామగ్రి చోరీకి గురైందని ఏఈఓ భావన ఫిర్యాదులో పేర్కొన్నారు.



మరికల్ రైతు వేదిక

లారీ చోరీ.. అమ్మేందుకు యత్నం

తాండూరు రూరల్: లారీని ఎత్తుకెళ్లి అమ్మేందుకు యత్నించిన దొంగను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని ఆసిఫ్‌కు చెందిన లారీని ఓగిపూర్ శివారులోని నాపరాతి గనుల్లో నడిపిస్తున్నాడు. ఈ వాహనానికి శివకుమార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే డ్రైవర్ ఈ నెల 18న రాత్రి కరన్‌కోట్‌లోని వివేకానంద విగ్రహం వద్ద లారీ నిలిపి ఇంటికి వెళ్లాడు. 19న ఉదయం వచ్చి చూడగా లారీ కనిపించలేదు. దీంతో యజమాని ఆసిఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు గ్రామానికి చెందిన వడ్డె కాశప్పను విచారించగా లారీని కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో డీజిల్ అయిపోయిందని అక్కడే నిలిపివేశానన్నాడు. దీంతో పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో నిందితుడు కాశప్ప

హత్యాయత్నం కారకులను అరెస్ట్ చేయండి

ఎస్పీకి ఎంపీ ఫిర్యాదు

వికారాబాద్: బీజేపీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌పై హత్యాయత్నం ఘటనకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఎన్కేపల్లిలో బాధితుడు రాఘవేందర్‌ను పరామర్శించి సంఘటనకు కారణమైన వారి వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తూ అడ్డు వచ్చిన వారిపై అధికార పార్టీ నాయకుడు కడుమూరు ఆనందం అతడి అనుచరులు రివాల్వర్‌తో దాడులకు పాల్పడడం సరికాదన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ ఎల్లవేలలా అండగా ఉంటుందన్నారు. సంఘటనకు కారణమైన అధికారపార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానంద్‌రెడ్డి, రమేశ్, కేపీ రాజు, విజయభాస్కర్‌రెడ్డి, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, నవీన్, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

బడుల బలోపేతానికి సహకరించండి

మర్పల్లి: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జస్టిస్ కొండా మాధవరెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ ట్రక్ వాహనానికి కొబ్బరికాయ కొట్టి పరిశుభ్రత పనులను ప్రారంభించారు. అనంతరం మండల విద్యాధికారి విద్యాసాగర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 300కు పైగా ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రత పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. అనంతరం మర్పల్లి జూనియర్ కళాశాల, మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, జిల్లా నాయకులు కేపీ రాజు, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంఈఓ విద్యాసాగర్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ, హెచ్‌ఎం అంజిలయ్య, పండరి, కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఇన్‌చార్జి రాములు, మండల కోఆర్డినేటర్ శేఖర్, సభ్యులు సంగమేశ్, ప్రశాంత్, మర్పల్లి జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్యాయత్నం

బంట్వారం: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్మకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని సల్బత్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రాజారావు (36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఇంకా వివాహం కాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో పురుగు మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి పక్కింట్లో ఉండే సోదరి రాజమ్మకు సమాచారం అందించారు. ఆమె వెంటనే తాం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ఏడీఏ సత్యనారాయణరెడ్డి

ధారూరు: నిజాం నవాబుల కాలంలో బిగించిన విద్యుత్ తీగలు తరచూ తెగిపడుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని ముక్తకంఠంతో ఏడీఏ సత్యనారాయణరెడ్డికి మొర పెట్టుకున్నారు. ఈ విషయమై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 18న «సాక్షి» దినపత్రికలో మాకెందుకు కరెంట్ ఉండదు అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన ఏడీఏ మంగళవారం ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, వినియోగదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ధారూరు బస్టాండు నుంచి కూరగాయల మార్కెట్ మీదుగా గ్రామ పంచాయతీ వరకు ప్రధాన మార్గంలో విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని వారు ఆందోళన వ్యకం చేశారు. వారి ఇబ్బందులను ఏడీఏకు వివరించారు. ధారూరు మండల కేంద్రంలో 24 గంటల పాటు కరెంట్ ఉండాలనీ చెబుతున్నా ఎక్కడ ఇది అమలు కావడం లేదన్నారు. సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఆపరేటర్లు తమకు సంబంధం లేదని, లైన్‌మెన్, ఏఈలకు ఫోన్లు చేసుకోండని దబాయిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, అమరేశ్వర్‌రావు, ఇబ్రహీం, దయాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగయ్య, ఎల్.అశోక్, మల్లికార్జున్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణరెడ్డి

ఎంఆర్‌టీ ల్యాబ్ ఏర్పాటుకు సహకరించండి

పాత విద్యుత్ వైర్ల స్థానంలో కొత్త లైన్ వేయిస్తాం. ఐరన్‌పోల్స్ తొలగించి సిమెంట్ స్తంభాలు వేయిస్తామని ఏడీఏ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పెట్టిస్తామని, ఇకనుంచి సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి మీ సమస్యలన్నీ అందులో ప్రస్తావిస్తే వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో మీటర్ల సరీ్వసింగ్ చేసే ఎంఆర్‌టీ ల్యాబ్ సెంటర్ లేదని, దానిని మీరు తెప్పించే ప్రయత్నం చేయాలనీ ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. గృహజ్యోతి పథకం లబ్ధిచేకూరని వారి కోసం ఎడిట్ ఆప్షన్ సోమవారం నుంచి వచ్చిందని, ఎంపీడీఓ ద్వారా సరిచేయించుకోవచ్చని సూచించారు. అంతకు ముందు ఏడీఏ, ఏఈ, కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలో తిరిగి విరిగిన, ఐరన్ పోల్స్‌ను పరిశీలించారు.

సాక్షి ఎఫెక్ట్..

వ్యక్తిపై గొడ్డలితో దాడి..

హత్యాయత్నానికి పాల్పడిన పాత నేరస్తుడు

బషీరాబాద్: ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన పాత నేరస్తుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రమేశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎక్మాయి గ్రామానికి చెందిన బోయిని నాగప్ప మూడు కేసుల్లో నిందితుడు. ఓ మర్డర్ కేసులో జైలు నుంచి బెయిల్‌పై వచ్చాడు. నాగప్ప మంగళవారం గ్రామంలోని సిరిగారి శ్యామ్(35) అనే వ్యక్తితో అకారణంగా గొడవపడ్డాడు. ఇదే విషయమై శ్యామ్ నిందితుడి ఇంటికి వెళ్లి నాగప్ప భార్యకు విషయం చెప్పాడు. ఇంటికి వచ్చిన భర్తను ఆమె నిలయదీయడంతో కోపం పెంచుకున్న నాగప్ప ఇంట్లోని గొడ్డలి తీసుకువెళ్లి శ్యామ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో ఆయన తల వెనక భాగం, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బషీరాబాద్ పోలీసులు బోయిని నాగప్పను 12 గంటల్లో పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి ట్రాక్ రికార్డు పరిశీలించి రౌడీషీట్ తెరుస్తామని సీఐ అశోక్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన బాధితుడు శ్యామ్

అత్తింటి వేధింపులకు గృహిణి బలవన్మరణం

కందుకూరు: భర్తతో పాటు అత్త ఇంటి వేధింపులు తాళలేక ఓ గృహిణి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని మాదాపూర్‌కు చెందిన మంద శ్రీనివాస్‌కు ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల గ్రామానికి చెందిన సువర్ణ(33)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. శ్రీనివాస్ డ్రైవర్‌గా, సువర్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భర్త ఏడాది నుంచి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తరచూ భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మరోమారు గొడవపడగా.. మనస్తాపానికి గురైన సువర్ణ అర్ధరాత్రి ఇంట్లోని సీలింగ్ రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి పుట్టింటి వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, ఆయన తల్లిదండ్రులు, తమ్ముడు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పరమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సువర్ణ(ఫైల్)